

వైద్య రంగంలో..

వైద్య రంగంలో కొలువుల పండగ జరిగింది. రెండువేలకుపైగా ఖాళీలు భర్తీ చేశారు.

- 8లో



అపురూపం..

కూర్మనాథుడు ఉత్తరాభిముఖంగా దర్శనమిచ్చాడు. డోలోత్సవం వైభవంగా జరిగింది.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ	బుధ
సాయంత్రం	ఉదయం
6.10	4.38

న్యూస్‌రీల్

నేడు రాజశ్యామల హోమం నిర్వహణ



అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం కల్చరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతం కావాలని కోరుతూ మంగళవారం రాజశ్యామల మూలమంత్ర సహిత దుర్గా సంపుటిత హోమం నిర్వహించనున్నట్లు కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సురిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద ఉన్న దుర్గా మహాలక్ష్మీ దేవాలయంలో మంళగవారం ఉదయం 8గంటల నుంచి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సు యాత్రలో గత ఐదేళ్ల సంక్షేమంతో పాటు రానున్న ఐదేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరిస్తారని పేర్కొన్నారు. ఈ యాగంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, మహిళలు, అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రూ. 2 లక్షలు నగదు పట్టివేత



నగదుతో పట్టుబడిన కారు

సరుబుజ్జిలి: ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు సోమవారం అమృతలింగానగరం వద్ద పట్టుకున్నారు. హిరమండలం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేయగా ఓ కారులో ఈ నగదు దొరికినట్లు వారు తెలిపారు. నగదును స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆర్‌ఎస్‌డీటీ ఎస్.వెంకటరావు, సిబ్బంది సత్యనారాయణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

పాతపట్నం: గంజాయి రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన ఐదుగురు వ్యక్తులను పాతపట్నం పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.20 లక్షలు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఒడిశా నుంచి పాతపట్నం ఆటోలో ఐదుగురు వ్యక్తులు వస్తుండగా పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో గంజాయి కనిపించింది. ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లా, గుసాని బ్లాక్, అడవ గ్రామానికి చెందిన సరోజ్ పాయక్, రాజా నాయక్, సంపత్ దండసేనా, లింగరాజు నాయక్, మున్నా నాయక్ కలిసి తమ బ్యాగ్‌లో 26 కిలోల గంజాయి తీసుకుని ఆటోలో పాతపట్నం వచ్చి, అక్కడ నుంచి ఆముదాలవలస రైల్వేస్టేషన్‌కు అక్కడ నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్తున్నట్లు విచారణలో తెలుసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

కాశీబుగ్గ: పలాస జీఆర్పీ స్టేషన్‌కు వచ్చిన సెల్‌ఫోన్ మిస్సింగ్ కేసుల బాధితుల్లో కొందరికి సోమవారం వారి సెల్‌ఫోన్లను అందించారు. రైళ్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పలాస జీఆర్పీ ఎస్‌ఐ ప్రత్యేక క్రైమ్ బృందాన్ని ఏర్పాటు చేసి సీఈఐఆర్ వెబ్‌సైట్ సాయంతో పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించారు. వీటి విలువ సుమారు రూ.1,00,999 ఉంటుందన్నారు. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో హెచ్‌సీ పి.కోదండరావు, పీసీ ఎం.సంతోష్‌కుమార్, బి.దేవేంద్రనాథ్, రమేష్‌బాబు కేసును డిటెక్ట్ చేశారు. వీటిలో రూ.60,999 విలువ కలిగిన ఎల్‌జీ మొబైల్ ఫోనును సచివాలయ ఉద్యోగి యువరాజుకి, రూ.20 వేలు విలువ కలిగిన శ్రీకాకుళం రోడ్డు ఆర్ఎస్‌కు చెందిన తాలూకా లక్ష్మణరావుకి, రూ.20 వేలు విలువ కలిగిన రియల్ మీ 8.5జిబి మొబైల్ ఫోను పూండి ఆర్ఎస్ నందు రైల్వే ఎంప్లాయీ తిరుపతిరావుకి అందించారు.

● రమ్మన్నప్పుడే రండి..

చెప్పింది చెయ్యండి

టీడీపీ అభ్యర్థుల పెత్తనపు పోకడలు

టీడీపీలో ఉన్న ప్రతీ ఒక్కరూ నాకు 100 శాతం సపోర్టు చేయాల్సిందే. చేసి తీరాల్సిందే. తెలుగుదేశంలో ఏ ఒక్కడైనా జెండా ముసుగులో ఎవరైనా పార్టీకి అన్యాయం చేసే పరిస్థితి వస్తే ఊరుకోను. నా దగ్గర ఆ పప్పులుడకవు. ఎవరు చేయకపోయినా రోడ్డు మీదకు ఈడుస్తాను.

– టీడీపీ శ్రేణులనుద్దేశించి గొండు శంకర్ చేసిన వ్యాఖ్యలివి

మేము కార్యక్రమం పెట్టినప్పుడే జనసేన నాయకులు రావాలి. మేము వస్తామన్నప్పుడే కార్యక్రమాలు పెట్టండి అని జనసైనికులు అనొద్దు. మాకు వీలు కుదరలేదు అన్న కారణంగా నిర్వహించొద్దు అని చెప్పొద్దు. జనసేన నాయకులు చెప్పినట్టుగా సమావేశాలు పెట్టలేం.

– జనసేన నాయకులను ఉద్దేశించి గౌతు శిరీష చేసిన వ్యాఖ్యలివి

- క్యాడర్‌పై టీడీపీ అభ్యర్థుల హుకుం
- పనిచేయకపోతే రోడ్డుకు ఈడుస్తానంటున్న గొండు శంకర్
- తాము కార్యక్రమాలు చేసినప్పుడే జనసైనికులు హాజరవ్వాలంటున్న శిరీష
- అభ్యర్థులగానే ఇంత పెత్తనమా అంటున్న టీడీపీ, జనసేన శ్రేణులు



పొలిటికల్ స్పాట్ లైట్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఇంకా ఎమ్మెల్యేలుగా వారెవరూ గెలవలేదు. ప్రస్తుతానికి అభ్యర్థిగా మాత్రమే నిలబడుతున్నారు. అప్పుడే ఆ నాయకులు హుకుం జారీ చేసే స్థాయికి వెళ్లిపోయారు. చెప్పింది చెయ్యాలంటూ క్యాడర్‌కు హుకుం జారీ చేస్తున్నారు. తాము చెప్పినట్టుగా నడుచుకోకపోతే కుదరదని చెబుతున్నారు. ఎన్ని బాధలున్నా తమతో కలిసి పనిచేయాల్సిందేనని, అంతకుమించి గత్యంతరం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారు.

గుండ అనుచరులే టార్గెట్..

తనను అభ్యర్థిగా ప్రకటించడమే తరువాయి గుండ లక్ష్మీదేవి అనుచరులను గొండు శంకర్ శ్రీకాకుళంలో టార్గెట్ చేస్తున్నారు. తమ నాయకురాలికి టిక్కెట్ రాలేదన్న ఆవేదనతో ఆందోళన చేస్తుంటే వారిని మరింత రెచ్చగొట్టేలా గొండు శంకర్ వ్యాఖ్యానించారు. ఇష్టం లేకపోయినా మద్దతివ్వాల్సిందేనని.. తన కోసం పనిచేసి తీరాల్సిందేనని.. పార్టీలో ఉండి చేయకపోతే తానేంటో చూపిస్తానని వార్నింగ్ ఇస్తున్నారు. టీడీపీ కార్యకర్తలను తన జీతగాళ్లుగా భావించి ఆయన పరుష వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇప్పుడీ వ్యాఖ్యలు గుండ లక్ష్మీదేవి వర్గీయుల్ని మరింత ఆవేదనకు గురిచేస్తున్నాయి. అందుకే గొండు శంకర్ అంటే తమకిష్టం లేదని, మదంతో ఉన్న వారితో కలిసి పనిచేయడం ఇష్టంలేకనే టిక్కెట్ వద్దని అంటున్నామని చెబుతున్నారు. నోరు మంచిది కాదని, భాష అంతకన్న మంచిగా ఉండదని, ఆయన మా అభ్యర్థి ఏంటని పెదవి విరుస్తున్నారు.

జనసైనికులకు వింత అనుభవం

జిల్లాలో తమకు ఒక్క సీటు కూడా రాలేదన్న ఆవేదనతో ఉన్న జనసైనికులకు టీడీపీ నాయకుల నుంచి వింత అనుభవం ఎదురవుతోంది. పొత్తులో భాగంగా కలిసి పని చేద్దామనుకున్నా టీడీపీ నాయకుల వైఖరి వారిని విస్తుగొలుపుతోంది. తాము చెప్పినప్పుడు రావాలి...తాము కార్యక్రమాలు నిర్వహించినప్పుడు హాజరవ్వాలే తప్ప మీకు వీలు కుదిరినప్పుడు కార్యక్రమాలు పెట్టలేమని...ఫలానా సమయంలో...ఫలానా రోజున కార్యక్రమాలు పెట్టండని చెప్పొద్దని...జనసైనికులను బాహాటంగానే ఆదేశిస్తున్నారు. వస్తే రండి...లేపోతే పోండి అన్నట్టుగా ఇప్పటికే వ్యవహరిస్తున్నారు. పొత్తు కుదిరిన దగ్గరి నుంచి అనేక అవమానాలను ఎదుర్కొంటున్న జనసైనికులకు సోమవారం జరిగిన కూటమి సమన్వయ సమావేశంలో అదే పరిస్థితి ఎదురైంది. పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష మాట్లాడుతూ జనసైనికులు తాము చెప్పినట్టుగా నడుచుకోవాలనే రీతిలో వ్యాఖ్యానించారు. ఆమె వ్యాఖ్యలు విన్న జనసైనికులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇప్పటికే తమను జెండా మోతగాళ్లగా అభివర్ణిస్తున్నారని, ఇప్పుడు శిరీష చేసిన వ్యాఖ్యలు తమను మరింత అవమాన పరిచేలా ఉన్నాయని అంటున్నారు.

● ఆనందమే సాక్షి



చిత్రంలో అవ్వాతాతల ఆనందం చూశారా. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిరుపేదలకు ఎంతగా నచ్చాయో చెప్పడానికి ఈ చిత్రమే సాక్షి. మందస మండలంలోని బొగాబందలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల గిరిజన విభాగం అధ్యక్షుడు సవర నీలకంఠం ఇంటింటికీ వెళ్తూ నారాయణ రావు, మహాలక్ష్మి దంపతులను కూడా కలిశారు. ప్రభుత్వ పథకాల గురించి వారికి వివరిస్తుంటే.. తాము కూడా అన్ని పథకాలు అందుకున్నామంటూ వారు ఇలా ఆనందం పంచుకున్నారు.

ఫొటో: కె.ఆనందరావు (మందస)

'పునఃపరిశీలన చేయకుంటే తగిన నిర్ణయం'



సమావేశంలో మాట్లాడుతున్న గుండ లక్ష్మీదేవి

శ్రీకాకుళం : శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వంపై అధిష్టానం పునఃపరిశీలన చేయకుంటే తగిన నిర్ణయం తీసుకుంటామని మాజీ శాసనసభ్యులు గుండ అప్పల సూర్యనారాయణ, గుండ లక్ష్మీదేవి దంపతులు చెప్పారు. వారు సోమవారం శ్రీకాకుళం నగర టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా తాము పార్టీ పట్ల విధేయులుగా ఉంటూ చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, అయినప్పటికీ రెండేళ్లుగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తికి బహుమతిగా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి ఎన్నోమార్లు ఈ విషయాన్ని తీసుకెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. గొండు శంకర్‌ను బలపరిచేది లేదని, ఆయనకు కాకుండా బండారు సత్యనారాయణమూర్తికి గానీ, కింజరాపు విజయలక్ష్మికి గానీ టికెట్టు ఇవ్వాలని సూచించారు. అంతకుముందు పలువురు కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ దంపతులిద్దరూ ఇండిపెండెంట్‌గా బరిలో ఉండాల్సిందేనని, ఈ విషయాన్ని నేరుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి గుండ దంపతులపై విధంగా వ్యాఖ్యానాలు చేయడాన్ని తప్పుబట్టి సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో అప్పలసూర్యనారాయణ సమావేశం అనంతరం ఓ పత్రికా ప్రకటన విడుదల చేసి ఈనెల 26న ఓ నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో జామి భీమశంకర్, మాదారపు వెంకటేష, చిట్టి నాగభూషణం, వెంకన్న యాదవ్, ప్రధాన విజయరాం, రమణ మాదిగ, సింతు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సమావేశానికి
డుమ్మా

- అట్టర్ ఫ్లాపైన కూటమి తొలి సమావేశం
- ఖాళీ కుర్చీలతో మమ అనిపించేసిన వైనం





నగరంలోని శాంతి కన్వెన్షన్ హాల్‌లో కూటమి ఉమ్మడి సమావేశంలో దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు (ఇన్‌సెట్లో) హాల్‌లో ఒకవైపు అంతా ఖాళీగానే ఉన్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యక్రమాలకు జనాలు కరువవుతున్నారు. పొత్తుపై అసంతృప్తో... మద్దతు కరువైందో గానీ ఇప్పటికే జరిగిన పలు సభలు పేలవంగానే సాగాయి. ముఖ్యంగా టీడీపీ, జనసేన కలిపి నిర్వహించిన యువగళం సభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ఇప్పుడా జాబితాలో మూడు పార్టీల సమన్వయ సమావేశం చేరింది. శ్రీకాకుళం నగర శివారులోని శాంతి కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరేందుకు టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మూడు పార్టీల సమావేశమంటే సాధారణంగా భారీ సభగా ఉంటుందని భావించాలి. కానీ, సోమవారం జరిగిన సమన్వయం సమావేశం తుస్సుమంది. ఉమ్మడి పోటీ ఇష్టం లేకనో మరేంటో తెలియదు గాని ప్రతి రోజూ గుండ లక్ష్మీదేవి ఇంటికి వస్తున్న అనుచరుల తాకిడి అంత కూడా లేదు.

ఇరుకు హాల్‌లో, పరిమిత కుర్చీలతో సభ ఏర్పాట్లు చేసినప్పటికీ సగం కూడా కుర్చీలు కూడా నిండలేదు. వచ్చిన వాళ్లలో కీలక నాయకులు తప్ప సామాన్య నాయకులు, కార్యకర్తలు పెద్దగా లేరు. సగానికి పైగా కుర్చీలు ఖాళీగా ఉండటంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నిర్వాహకులకు ఎదురైంది. దీంతో ఉమ్మడి తొలి సమావేశాన్ని మమ అనిపించేశారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఏ పార్టీకైనా జోష్ వస్తుంది. మరింత ఆనందంతో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరవుతాయి. కానీ, ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపించింది. మండల స్థాయి సమావేశానికి హాజరైన జనాలు కూడా లేకపోవడం చర్చనీయాంశమైంది. ఈ సమావేశానికి గుండ ఫ్యామిలీ, కలమట వెంకటరమణ, బగ్గు లక్ష్మణరావు తదితరులు హాజరుకాకపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టం

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు
- సెబ్ జాయింట్ డైరెక్టర్, అదనపు ఎస్పీ డి.గంగాధరం



సెబ్ జేడీ డి.గంగాధరం

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తామని, సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టం చేస్తున్నామని జిల్లాకు కొత్తగా వచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో(సెబ్) జాయింట్ డైరెక్టర్ (జేడీ), అదనపు ఎస్పీ డి.గంగాధరం అన్నారు. జిల్లాకేంద్రాన్ని ఆనుకొని ఫరీదుపేటలో ఉన్న జిల్లా సెబ్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి : ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చారు. ఎలాంటి ప్రణాళికతో ముందుకు వెళ్తారు?

అధికారి : అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ మద్యం, సారాయి మన ఏపీలోకి రాకుండా ప్రధానంగా చెక్ పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేస్తాం. ఆ దారుల్లో వాచ్ రూట్ వెహికల్స్ తిరిగేలా చూస్తాం. అంతర్గత రహదారుల్లో బోర్డర్ పోలీస్ వెహికల్స్ డేఅండ్ నైట్ తిరిగేలా చేసి అక్రమ రవాణాను అడ్డుకుంటాం. ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) యాక్ట్ ప్రకారం మాదక ద్రవ్యాల రవాణాను నిరోధిస్తాం. లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ రాత్రి సమయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాం.



సాక్షి : జిల్లా సెబ్ పరిధిలో ఎన్ని స్టేషన్లు ఉన్నాయి. చెక్‌పోస్టుల మాటేమిటి?

అధికారి : జిల్లాలో 12 వరకు సెబ్ స్టేషన్లు ఉన్నాయి. డివిజన్లుగా చూసుకుంటే పలాస, శ్రీకాకుళం ఉన్నాయి. పలాస డివిజన్‌లో పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, టెక్కలి, కోటబొమ్మాళి, కొత్తూరు, పాతపట్నం ఉండగా దీని కి ఇన్‌చార్జిగా ఐ.ఎ.బేగం (ఎన్‌ఫోర్సు సూపరింటెండెంట్) వ్యవహరిస్తారు. శ్రీకాకుళం డివిజన్‌లో శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, పొందూరు, రణస్థలంలు ఉండగా ఇన్‌చార్జిగా ఈఎస్ తిరుపతినాయుడు ఉన్నారు. చెక్‌పోస్టుల విషయానికొస్తే సెబ్ పరంగా పురుషోత్తపురం, వసుంధరలో ఉన్నాయి.

సాక్షి : ఒడిశా మద్యాన్ని ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. దీన్ని ఎలా నిరోధిస్తారు?

అధికారి : ఇప్పటికే ఐడీ లిక్కర్ పాయింట్లను గుర్తించాం. వాటిని సీజ్ చేయాలని అధికారులను సూచించాం.

సాక్షి : జిల్లా ప్రజలకు ఎన్నికల దృష్ట్యా మీరిచ్చే సూచన?

అధికారి : ప్రలోభాలకు లొంగి అక్రమంగా నగదు, మద్యం తరలించాలనే ఉద్దేశంతో లేనిపోని రిస్కులు చేయకండి. ఇలాంటి విషయాల్లో పట్టుబడితే కేసుల్లో ఇరుక్కుంటారు. అధికారులు కూడా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి.

కొత్తూరు తహసీల్దార్‌పై కలెక్టర్ అసహనం



కొత్తూరు మండలం అడ్డంగి పోలింగ్ బూత్‌ను పరిశీలించిన కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



కొత్తూరు తహసీల్దార్ ఎంవీపీ ప్రసాద్‌పై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్

కొత్తూరు: స్థానిక తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్‌పై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని పోలింగ్ బూత్‌ల వివరాల అడగడంతో తహసీల్దార్ చెప్పడానికి తడబడ్డారు. దీంతో కలెక్టర్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పనితీరు మెరుగుపడకపోతే మరోచోటకు బదిలీ చేస్తానని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఉన్న స్థానిక ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ ఎన్నికల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మండలంలోని ఎత్తైన తివ్వ కొండ శిఖరం మీద ఉన్న అడ్డంగి గిరిజన గ్రామంలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల జీవన విధానం గురించి ఆరా తీశారు. అనంతరం కొత్తూరు మండలం కర్లెమ్మ చెక్‌పోస్టును పరిశీలించారు.

30న జిల్లా అండర్-23, సీనియర్స్ పురుషుల క్రికెట్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా పురుషుల అండర్–23, పురుషుల సీనియర్స్ క్రికెట్ జట్ల ఎంపికలను ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వైఎస్ శాస్త్రి, హసన్‌రాజ, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి కెఎస్‌ఎం శైలానీ తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో/క్రికెట్ నెట్స్‌లో జరగే ఈ ఎంపికలు శనివారం ఉదయం 8 గంటలకు మొదలవుతాయని చెప్పారు. సీనియర్స్ విభాగంలో వయస్సుతో సంబంధం లేదని, అండర్– 23కి మాత్రం 2001 సెప్టెంబర్ ఒకటి తర్వాత జన్మించి ఉండాలని ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండా లని స్పష్టంచేశారు. ఇక్కడ ఎంపికచేసిన ప్రాబబుల్స్ జట్లకు త్వరలో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు కోచ్ కె.సుదర్శన్ (94411 15396)ను సంప్రదించాలని వారు కోరారు.





● రంగుల వేడుక

హోలీ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా అంతా రంగులు చల్లుకుంటూ రోజంతా సందడిగా గడిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు కూడా ఈ సంబరాల్లో పాలు పంచుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



పాతపట్నం: అచ్యుతాపురం చెరువులో వేతనదారులతో హోలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కాశీబుగ్గ: మంత్రి అప్పలరాజు ఇంటి వద్ద హోలీ సందడి

క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు ఏజీ



శ్రీకూర్మనాథాలయంలో హైకోర్టు ఏజీ వేణుగోపాలం దంపతులు

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుడిని హైకోర్టు ఏజీ పి.వేణుగోపాలం సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు గోత్రనామాలతో పూజలు చేశారు. అనంతరం రెండు ధ్వజస్తంభాలు, లక్ష్మీసన్నిధి, వైష్ణవీదుర్గలను సందర్శించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్రమహాత్యాన్ని తెలియజేయగా, ఈఓ గురునాథం క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు.

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



మహామేరువుకు పుష్పాభిషేకం

ఎచ్చెర్ల: కుంచాలకూర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో పూర్ణిమ సందర్భంగా సోమవారం పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇక్కడ ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారికి పలు అభిషేకాలను నిర్వహించారు. ఆవరణలో ఉన్న మహామేరువుకు, శ్రీచక్రాలకు ప్రత్యేక కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

'జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో రాణించండి'



ఎంపికైన క్రీడాకారులతో ఫెన్సింగ్ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజా, కోచ్ వంశీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సబ్–జూనియర్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలతో తిరిగిరావాలని ఫెన్సింగ్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్(రాజా) పిలుపునిచ్చారు. రాజమండ్రిలోని జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల ప్రాంగణం వేదికగా మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు జిల్లా నుంచి ఎస్.వెంకటసూర్య, ఎస్.గాయిత్రి ఎంపిక కాగా.. వీరిద్దరూ ఆదివారం రాత్రి ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. వీరికి శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత సుజాత

గార: శ్రీకూర్మనాథాలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నం నగరంలోని పీఎం పాలెంకు చెందిన కె.సుజాత రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆలయ ఈఓ జి.గురునాథంకు సోమవారం ఆలయంలో విరాళాన్ని అందించారు.

అడుగంటుతోంది..!

సరుబుజ్జిలి: వంశధార నదిలో నీరు అడుగంటిపోతోంది. సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, యరగాం, పెదమాలపేట, పెద్దసవళాపురం గ్రామాల వాసులు తమ పశువులు, ఇతర అవసరాల కోసం ఇసుక తిన్నెల్లో గోతులు తీసి నీటిని వినియోగిస్తున్నారు.



● కలశ కాంతలు



సన్యాసిపుట్టుగ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర ఆలయం ప్రతిష్టాపన మహోత్సవం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు ఊరేగింపుగా కలశాలను తీసుకొని స్థానిక బాహుదా నదిలో నిమజ్జనం చేశారు.

– ఇచ్ఛాపురం రూరల్

● ముగిసిన వల్లభుని డోలోత్సవాలు



రట్టి వల్లభనారాయణుని యాత్రకు భక్తులు పోటెత్తారు. ఈ నెల 20వ తేదీ నుంచి స్వామి వారి డోలోత్సవం ప్రారంభం కాగా సోమవారం ముగిసింది. డోలోపౌర్ణమి సందర్భంగా వల్లభనారాయణస్వామిని దూర తీరాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రట్టి బీచ్ వద్ద పోలీసులు నిఘా వేశారు. సోమవారం రాత్రి స్వామి కోలసేవను నిర్వహించారు.

మందస:

వైద్యరంగంలో కొలువుల పండుగ

- గత 58 నెలల్లో 2 వేలకు పైగా ఉద్యోగాల భర్తీ
- ఇందులో 193 వైద్యుల పోస్టులే
- ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసేలా ప్రత్యేకంగా నియామక బోర్డు



అరసవల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో కొలువుల పండగ నిర్వహించింది. ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తూ ఆస్పత్రుల్లో మానవ వనరుల కొరతను అధిగమించింది. కోవిడ్ భూతం యావత్ ప్రపంచాన్ని కుదిపేసిన సమయంలోనూ కొత్తగా అధికారాన్ని చేపట్టిన వైఎస్ జగన్ ప్రభుత్వం ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాలతో లక్షలాది మంది ప్రాణాలు నిలబడ్డాయి. ఇలాంటి విపత్కర పరిస్థితులనుంచి గట్టెక్కాలనే ఉద్దేశంతో ముందుగా వైద్యరంగంలో ఖాళీలన్నీ భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియామకాలను ప్రోత్సహించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ తదితర ఉన్నతాధికారుల సమక్షంలో ఖాళీలను అర్హులతో భర్తీ చేసి ఎక్కడా ఖాళీలు లేకుండా క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు చేపట్టారు. దీంతో గత ప్రభుత్వాల హయాంలో కంటే అత్యధికంగా పోస్టులను భర్తీ చేసినట్లుగా రికార్డులెక్కారు.

2 వేలకు పైగానే పోస్టుల భర్తీ

జిల్లా వైద్యారోగ్య శాఖలో వివిధ రకాల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ 2019 నుంచి వేగవంతమైంది. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో కేవలం 410 ఔట్‌సోర్సింగ్ పోస్టులను, 80 రెగ్యులర్ పోస్టులను మాత్రమే భర్తీ చేయగా.. వైఎస్ జగన్ సర్కార్ మాత్రం ఏకంగా రెండు వేలకు పైగా పోస్టులను భర్తీ చేసింది. కొత్తగా ఐదు పీహెచ్‌సీలు, 12 అర్బన్ పీహెచ్‌సీలను కూడా ప్రభుత్వం మంజూరు చేసి ప్రారంభించడంతో కొత్త పోస్టుల సృష్టి జరిగింది. దీంతో మొత్తం 79 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కడా ఖాళీ లేకుండా ప్రభుత్వం నియామకాలను పూర్తి చేసింది. ప్రధానంగా పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లను రెగ్యులర్, కాంట్రాక్ట్ విధానంలో మొత్తం 193 మందిని నియమించడంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలుతో పాటు క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందే లా చర్యలు చేపట్టారు. ఈ పోస్టులతో పాటు వివిధ క్యాడర్లలో మొత్తం 1993 పోస్టులను జగన్ సర్కార్ భర్తీ చేసింది. వైద్యశాఖ నియామకాల్లో ఇదో రికార్డు అని అధికారులే చర్చించుకుంటున్నారు. అలాగే తాజాగా 177 మంది కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేశారు.

ప్రత్యేకంగా నియామక బోర్డు

2019కి ముందు వైద్య శాఖలో ఏదైనా పోస్టును భర్తీ చేయాలంటే ఆయా విభాగాల నుంచి ప్రతిపాదనలు పంపి నెలలు, ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ఈ కాలయాపనకు వైఎస్ జగన్ సర్కార్ ఫుల్‌స్టాప్ పెట్టింది. వైద్యశాఖలో పోస్టుల భర్తీకి అత్యవసర ఉత్తర్వులను జారీ చేసింది. ఈ శాఖలో ఏర్పడిన ఖాళీలను అత్యవసరంగా అప్పటికప్పుడు భర్తీ చేసేలా అత్యవసర ఉత్తర్వులిచ్చింది. అంతేకాకుండా వైద్యశాఖ కోసమే ప్రత్యేకంగా నియామక బోర్డును సైతం ఏర్పాటు చేసింది. ఈ చర్యల ఫలితంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించాయి. మరోవైపు పేద ప్రజలకు వైద్య సేవల కల్పనలో గణనీయమైన మార్పు వచ్చింది. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలులో భాగంగా ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరేసి వైద్యులుండేలా నియామకాలు జరిపింది.

2019 నుంచి 2023 వరకు పోస్టుల భర్తీ ఇలా

క్యాడర్	పోస్టుల సంఖ్య
మెడికల్ ఆఫీసర్లు (రెగ్యులర్)	152
మెడికల్ ఆఫీసర్లు (కాంట్రాక్ట్)	41
స్టాఫ్ నర్సులు	302
ఎంఎల్‌హెచ్‌పి	409
ల్యాబ్ టెక్నీషియన్స్	70
ఫార్మాసిస్టులు	56
ఏఎన్‌ఎం / సచివాలయాలు	610
క్లాస్ –4 స్టాఫ్	166
ఎంపిహెచ్‌ఏ (మేల్)	177
ఎంపిహెచ్‌ఏ (ఫిమేల్)	10
మొత్తం	1993

అపురూపం.. కూర్మనాథుని ఉత్తరాభిముఖ దర్శనం



దోలో మంటపంలో దర్శనమిస్తున్న స్వామి

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఉత్తరాభిముఖ దర్శనం సోమవారం వైభవంగా జరిగింది. డోలోత్సవంలో చివరి ఘట్టమైన ఊయల సేవను డోలో మంటపంలో నిర్వహించారు. ఉభయనాంచారులతో ఉన్న స్వామిని భక్తులు ఉత్తరాభిముఖంగా దర్శించుకోవడంతో పాటు గోవిందరాజ స్వామి పాదస్పర్శ చేసి పులకించిపోయారు. డోలో మంటపంలో శ్రీకూర్మనాథుడిని ఉత్తరాభిముఖంగా దర్శిస్తే మోక్షమార్గం కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలిపారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానం



వంశధార నదిలో పార్వతీ పరమేశ్వరులకు చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న అర్చకులు,భక్తులు

జలుమూరు: డోలోత్సవాల్లో భాగంగా శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలు వంశధార నదిలో సోమవారం ఘనంగా జరిగాయి. విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైన ఈ పూజల్లో నమక, చమకంతోపాటు క్షీరాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వర ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో దక్షిణ ముఖంగా మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. మహిళలు,భక్తులు స్వామికి హారతులు ఇవ్వగా అనంతరం వంశధార నదీతీరాన తూర్పు ముఖంగా స్వామికి చక్రతీర్థ స్నానాలు చేయించారు. అనంతరం స్వామి విగ్రహాలను ఆలయంలో యథాస్థానంలో ఉంచి పూజలు చేశారు. దీనికి ముందు స్వామికి ప్రత్యేక పూజలు చేసి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ పి.ప్రభాకరరావు, ఆలయ సిబ్బంది, అర్చకులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

ఉద్యానవనంలో ఆదిత్యుడు



తోట ఉద్యానవన మండపంలో పూజలందుకుంటున్న ఆదిత్యుని ఉత్సవమూర్తులు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయంలో డోలోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగించారు. వెండి సింహాసనంలో మాడవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి తోట ఉద్యానవన మండపంలో ఉంచారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, షణ్ముఖశర్మలు మండపంలో ప్రత్యేకంగా ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. హోలీ సందర్భంగా రంగులను ఉత్సవమూర్తులపై చల్లి.. రంగులనే బొట్టుగా భక్తులకు అందజేశారు.

ముసిరిన వంశధార



వంశధారలో చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న దృశ్యం

హిరమండలం: సుభలయ సమీపంలోని తపోగిరిపై వెలసి ఉన్న వెంకటేశ్వర స్వామికి సోమవారం వంశధారలో వైభవంగా చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రధాన అర్చకులు బృందావన పండా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో సమీప వంశధారకు తీసుకెళ్లి చక్రతీర్థ స్నానాలు చేశారు. అనంతరం భారీ అన్న సంతర్పణ జరిగింది.

వేణుగోపాలుడి సన్నిధిలో పర్లాకిమిడి మహారాణి



వేణుగోపాల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహారాణి కల్యాణిదేవి గజపతి

మెళియాపుట్టి: పర్లాకిమిడి మహారాజు కృష్ణచంద్ర గజపతి మనుమరాలు, ప్రస్తుత మహారాణి కల్యాణీ దేవీ గజపతి సోమవారం స్థానిక రాధాగోవింద స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన తాతగారి హయాంలో ఆలయం చుట్టూ భవనాలు, జామ తోటలు ఇతరత్రా ఉండేవని ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరిందని అన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరిన యువకులు

శ్రీకాకుళం రూరల్: రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో జనసేన పార్టీకి చెందిన 15 మంది యువకులు సోమవారం ఇల్లీసిపురానికి చెందిన వానపల్లి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి ధర్మాన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొండు కృష్ణమూర్తి, అల్లు లక్ష్మీనారాయణ, చీకటి దానయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన సచివాలయ ఉద్యోగి

కాశీబుగ్గ: ఇంటర్నేషనల్ ఓపెన్ పారా మెడికల్ చాంపియన్ షిప్ ఆరో మీట్ గత రెండు రోజులుగా బెంగళూర్‌లో జరుగుతోంది. ఈ క్రీడా పోటీల్లో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నర్సిపురం సచివాలయంలో వార్డు ఎమినిటీ సెక్రటరీగా పనిచేస్తున్న నెయ్యిల రమణయ్య ప్రతిభ చూపాడు. వంద మీటర్ల రన్నింగ్ పోటీల్లో సిల్వర్‌మెడల్ సాధించి విజేతగా నిలిచాడు. అనంతరం లాంగ్ జంప్‌లో బ్రాంజ్ మెడల్ సైతం సాధించాడు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

'పొత్తులను చిత్తు చేసేందుకు సిద్ధం కావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

వజ్రపుకొత్తూరు రూరల్: మోసపూరిత హామీలను గుప్పిస్తూ అధికారం కోసం పొత్తులతో ప్రజల ముందుకు వస్తున్న నాయకులను రానున్న ఎన్నికల్లో చిత్తు చేసేందుకు సిద్ధం కావాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. వజ్రపుకొత్తూరులో సోమవారం వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ మనందరి ప్రభుత్వం ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ నాయకులను ఆశీర్వదించాలని అన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు, సచివాలయ కన్వీనర్ వడ్డి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ సర్పంచ్



మాజీ సర్పంచ్ హరికృష్ణకు కండువా వేస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: మందస మండలం బహాడపల్లి మాజీ సర్పంచ్ బొడ్డు హరికృష్ణ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనను మంత్రి సీదిరి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అగ్గున్న సూర్యారావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాస్, బహాడపల్లి సర్పంచ్ బొడ్డు ఉదయ్‌కుమార్, గ్రామ అధ్యక్షులు మామిడి తులసయ్య, మామిడి కృష్ణ, రెయ్య కూర్మారావు తోపాటు పలువురు పాల్గొన్నారు. అలాగే మందస మండలం లింబుగాం గ్రామంలోని పలు కుటుంబాలు కూడా పార్టీలోకి చేరాయి. పార్టీలో చేరిన వారిలో నర్తు నాయికన్నా, పులారి పున్నయ్య, పులారి మహాలక్ష్మి, నర్తు జయకృష్ణ, పులారి, పులారి భానుమ్మ, నర్తు హిమావతి, నర్తు రమ్య, నర్తు ఢిల్లమ్మ, పులారీ సాయమ్మ తదితరులు ఉన్నారు.

క్రికెటర్ సాయిదీప్తికి అభినందనలు



విశాఖపట్నంలో సాయిదీప్తిని అభినందిస్తున్న ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి

కంచిలి: మహిళా క్రికెట్‌లో అండర్–19 విభాగంలో రాష్ట్ర జట్టు తరఫున ఆడుతున్న మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన బొగియా సాయిదీప్తిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి బృందం అభినందించింది. విశాఖపట్నంలోని వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం రాష్ట్ర జట్టు బృందానికి నిర్వహించిన అభినందన సభలో సన్మానించారు. టీ 20 మ్యాచ్‌లో రన్నర్‌గా నిలిచినందుకు జట్టు సభ్యులందరినీ అభినందిస్తూ, ఎలక్ట్రికల్ స్కూటీలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఏసీఏ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి, రిప్రజెంటేటివ్ ఎస్.గీత, మిగతా సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



లారీని క్రేన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..పలాస నుంచి శ్రీకాకుళం వైపు ఐరన్ గజాల లోడ్‌తో వెళ్తున్న లారీని కె.కొత్తూరు సమీపంలో వెనుక నుంచి రైల్వే సామగ్రి తీసుకువస్తున్న మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి ఢీకొట్టిన లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు గుర్తించి హైవే అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. దీంతో స్థానికుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్ సాయంతో లారీని పక్కకు తీశారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

మందస బస్టాండ్‌లో వ్యక్తి మృతి



రాజావారికోట ఆవరణలో సింహాచలం మృతదేహం

మందస: మందస బస్టాండ్‌లోని రాజావారి కోట ఆవరణలో సింహాచలం(45) అనే వ్యక్తి సోమవారం మరణించాడు. చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులను ఏరుకుని, మందసలోనే ఇటీవల తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు. ఏమైందో, ఏమో శవమై కనిపించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్, మందస ఈఓ బమ్మిడి నవీన్‌కుమార్, వీఆర్‌ఓ కె.భైరాగి, రెల్ల లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు ఆరా తీశారు. సింహాచలం(సిమ్మ) సొంత గ్రామం పలాసగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బంధువులు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.